తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
11-04-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 75
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–


రేడియం స్టిక్కర్ రూ.100 కోట్ల మాయాజా...

## రేడియం స్టిక్కర్ల దందాపై
# రవాణా శాఖ వెనక్కి!

- వంద కోట్ల మాయాజాలంపై 'సిరి న్యూస్' కథనానికి స్పందన
- సోమవారం నుంచి పాత పద్ధతిలోనే
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- కేవలం ఐదు కంపెనీలకే టెండర్ల ధారాదత్తంపై ప్రజాగ్రహం
- వెలుగులోకి తెచ్చిన 'సిరి న్యూస్'కి ప్రశంసల జల్లు

4



# మరోమారు ఎదురు కాల్పులు

3

- మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
- అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

## మూసీ అభివృద్ధిలో భాగస్వాములను చేయండి

ఉప ముఖ్యమంత్రికి మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితుల వినతిపత్రం



3



## మహిళా కోటాతో
# డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

డీ లిమిటేషన్‌పై సమిష్టిగా చర్చించాల్సిందే ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:
అసెంబ్లీ సీట్లలో మహిళా కోటా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ పేరుతో

మిగతా 3వ పేజీలో..




## శ్రీపాదరావుకు సీఎం రేవంత్ నివాళి

3

# సీన్ రిపీట్!
## హస్తం పార్టీలో అసంతృప్తి జ్వాలలు!

- గత బీఆర్ఎస్ దారిలోనే మిస్టేక్స్..
- అప్పుడు సీనియర్లను దూరం చేసుకున్న 'కారు'.. ఇప్పుడేమో కాంగ్రెస్
- తెలంగాణ కాంగ్రెస్ లో ముదురుతున్న ఆధిపత్య ధోరణి
- వీళ్ల తీరుతో కరుడుగట్టిన కాంగ్రెస్ వాదులు సైతం పార్టీకి దూరం
- 40 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి
- తనను పట్టించుకోవడంలేదనే ఆవేదనలో ధర్మపురి సంజయ్
- మంత్రి పదవి దక్కకుంటే కోమటిరెడ్డి తిరుగుబాటేనా?
- లోలోపల మదనపడుతూ గుంభనంగా మరికొందరు సీనియర్లు
- ఇలాంటి తప్పులే చేసి గతంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్
- ప్రక్షాళన చేసుకుంటారా ?..పట్టు కోల్పోతారా ?



(పొలిటికల్ బ్యూరో - సిరి న్యూస్) :
పదేళ్ల నిరీక్షణ తర్వాత అధికార పీఠాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు అంతర్గత కుమ్ములాటలు కలకలం రేపుతున్నాయి. పార్టీని దశాబ్దాలుగా నమ్ముకున్న ఉద్దండులు, కష్టకాలంలో అండగా నిలిచిన సీనియర్లు ఇప్పుడు రేవంత్ సర్కార్ తీరుపై గుర్రుగా ఉన్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఏ తప్పులు చేసి అధికారాన్ని కోల్పోయిందో ఇప్పుడు కాంగ్రెస్ కూడా అచ్చం అదే బాటలో పయనిస్తోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కొత్తగా

మిగతా 2వ పేజీలో..

# గాలి మోటార్లలో సీఎం, మంత్రుల టూర్లు

- ఎవరికీ పట్టని రైతుల కష్టాలు
- ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనాల్సిందే
- బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

సదాశివపేట, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:
కోటా సాకుతో శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు నిలిపివేసి రైతులను నిలువునా ముంచుతున్నారని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. సదాశివపేట రైతు సేవా కేంద్రంలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. కోటా అయిపోయిందంటూ కొనుగోళ్లు నిలిపివేయడంతో వారం రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్న రైతుల

మిగతా 3వ పేజీలో..





2

ప్రమాదాలు తగ్గించేందుకు
## అరైవ్ అలైవ్

- 18వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

- మొబైల్ ఫోన్ల విషయంలో ఆరోపణలు నిరాధారం
- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి
- లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు

హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:
అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ

మిగతా 2వ పేజీలో..



మహిళా రిజర్వేషన్లపై
# విమర్శలు తగవు

ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే డీలిమిటేషన్‌తో ఎవరికీ అన్యాయం జరగదు సిఎం రేవంత్ వ్యాఖ్యల పై బీజేపీ ఎంపీ డీకే అరుణ



2

## సైబర్ నేరాల్లో రికవరీ అంతంతే

సొమ్ము పోయిందా తిరిగి రావడం కష్టమే వెల్లడించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

2



3

## ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

- 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ ప్రకటన
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్

వికసిత భారత్ లక్ష్య సాధనలో
# మినరల్స్ కూడా కీలకమే

- మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2



వచ్చే విద్యా సంవత్సరానికి
# డిగ్రీ ప్రవేశాలు

15 నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ

2

తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

## సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు శరవేగంగా చేపట్టాలి



- వచ్చే 50 ఏళ్లు నిలిచేలా పనులు జరగాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

7



## ప్రమాదాలు తగ్గించేందుకు
# ‘అరైవ్ అలైవ్’

- **18వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు**
- **పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే :**

రవాణా శాఖ నిబంధనలు ప్రచారం చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకోవడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్అలైవ్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమవారం నుంచి 18వ తేదీ వరకు రోడ్ సేఫ్టీ కోసం పోలీస్, రవాణా శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపడుతున్నట్లు, పర్యావరణ పరిరక్షణ కోసం రవాణా శాఖ చర్యలు తీసుకుంటున్నదని, ట్రాఫిక్ నిబంధనల అమలుకు కఠిన చర్యలు తీసుకుంటుందని, ఈ ఆరు రోజుల్లో అన్ని జిల్లాల్లో శాఖాపరంగా సమీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం లేకుండా చూడటమే కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రమాదం జరిగిన గంట(గోల్డెన్ అవర్)లో హాస్పిటల్‌లో బాధితుడిని హాస్పిటల్‌లో చేర్పిస్తే రహవీర్ అవార్డు ఇస్తారన్నారు. చెక్ పోస్టులు ఎత్తివేసి సంస్కరణలు తీసుకొచ్చామని, అన్ని స్కూళ్ళలో విద్యార్థులకు రవాణా నిబంధనలు వివరించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆర్టీసీలో 30 ఏళ్ల సర్వీసులో ఉండి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని వారికి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. రోడ్ సేఫ్టీ సమావేశాలు ప్రతీ జిల్లాలో నిర్వహించాలని ఆదేశించారు.

**ఆర్టీసీ విలీనం అంశం కమిటీ దగ్గర ఉన్నది**

కాగా, ఆర్టీసీలో సమ్మె విషయంపై మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశం కమిటీ దగ్గర ఉన్నదని, రెండు సమస్యలపై మినహా మిగతా అంశాలపై చర్చించడానికి సిద్ధమని తెలిపారు. సిబ్బందికి సంబధించిన అంశాలు పరిష్కరిస్తామన్నారు. ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దని, పెండింగ్ డీఏ ఇచ్చాం.. పీఆర్‌సీపై ఆలోచిస్తున్నాం అని మంత్రి పొన్నం చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివ లింగయ్య, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో
# మినరల్స్ కూడా కీలకమే

- **మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి**
- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, కె□లీమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్‌స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్సప□`లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్‌స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల పక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



## వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13:, సిరి న్యూస్‌టుడే**

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026`27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్టేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# సీన్ రిపీట్!

మొదటిపేజీ తరువాయి

వచ్చిన వారికి పెద్దపీట వేస్తూ, పాత తరాన్ని విస్మరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో.. అధిష్టానం మేల్కోకపోతే ‘సీన్ రిపీట్’ కావడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు ఏం జరుగుతోంది? సీనియర్ల తిరుగుబాటు పార్టీ భవిష్యత్తును ఎలా మార్చబోతోంది? అనే అంశంపై ‘సిరి న్యూస్’ ప్రత్యేక కథనం..

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, సీనియర్ల అసంతృప్తి క్రమంగా తారాస్థాయికి చేరుకుంటున్నాయి. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్, అలాగే ఢిల్లీ అధిష్టానం పెద్దగా పట్టించుకోకపోవడం పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది. ఒకప్పుడు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనూ పునరావృతం అవుతున్నాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

**40 ఏళ్ల అనుబంధానికి బ్రేక్...**

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలబడి, దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన సీనియర్లను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెడుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సీనియర్ నేత జీవన్ రెడ్డి లాంటి వారు ఏకంగా 40 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధాన్ని వదులుకుని పార్టీని వీడే పరిస్థితి రావడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఇలాంటి ఉద్దండులు కాంగ్రెస్‌ను వీడటం భవిష్యత్తులో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**అసహనంగా ‘ధర్మపురి’..**

కాంగ్రెస్ పార్టీతో దశాబ్దాల అనుబంధం ఉన్న ధర్మపురి సంజయ్ సైతం ప్రస్తుత పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో తనను ఏమాత్రం పట్టించుకోకుండా పక్కకు పడేశారని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. రేవంత్ సర్కార్ తీరుపై గుర్రుగా ఉన్న ఆయన సైతం త్వరలోనే పార్టీని వీడనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**మంత్రి పదవి కోసం ‘కోమటిరెడ్డి’ ఫైట్..**

మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా రేవంత్ సర్కార్ పై ఆగ్రహంతోనే ఉన్నారు. తనకు మంత్రి పదవి దక్కాలని ఆయన ఎప్పటినుంచో బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ఒకవేళ ఆయనకు మంత్రి పదవి ఇవ్వకపోతే, ఆయన తీసుకోబోయే నిర్ణయం పార్టీకి తలనొప్పిగా మారే ప్రమాదం ఉందని కాంగ్రెస్ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

**గుంభనంగా మరికొందరు సీనియర్లు..**



కేవలం బయటపడిన నేతలు మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో ఇంకా అనేకమంది సీనియర్లు రేవంత్ రెడ్డి, ఢిల్లీ పెద్దల వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని, కొత్తగా వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారని వారు లోలోపల రగిలిపోతున్నారు. బహిరంగంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కకపోయినా, సరైన సమయం కోసం వీరంతా వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

**నాడు బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్..**

ప్రస్తుతం కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషకులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చి చూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీ కూడా సీనియర్ నేతలను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు వంటి అత్యంత జనాదరణ, బలమైన క్యాడర్ కలిగిన నేతలను వదులుకోవడం వల్లే బీఆర్ఎస్ అధికారానికి దూరమైందని రాజకీయ పండితులు స్పష్టం చేస్తున్నారు.

**హిస్టరీ రిపీట్ అవుతుందా ?**

ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సైతం అచ్చం అదే దారిలో పయనిస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సీనియర్ల అనుభవాన్ని వాడుకోకుండా వారిని దూరం చేసుకోవడం వల్ల, వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీకి భారీ నష్టం జరిగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. అధిష్టానం తక్షణమే నష్టనివారణ చర్యలు చేపట్టి, సీనియర్లను కలుపుకుపోకపోతే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుంది.. అదే సీన్ రిపీట్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

మొదటిపేజీ తరువాయి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు లీగల్ నోటీసు పంపించారు. మంత్రి తరఫున అడ్వకేట్ నాగులూరి కృష్ణకుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసు పంపించారు. నోటీసులో అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని, కమిటీ నిర్ణయాల ప్రకారం సరఫరాకు ఒప్పందం చేసుకున్నారని, ఇందులో తన ప్రమేయం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లే ఉన్నప్పటికీ రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా కొనుగోలు చేసినట్టు తెలిపారు. అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచనల మేరకే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు 48 గంటల్లో సోషల్ మీడియా పోస్టులను తొలగించి పార్టీ, కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అనంతరం ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క అంగన్‌వాడీలకు మొబైల్స్ కొనుగోలు విషయంలో బీఆరఎస్ పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తోందని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరైనా ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ అవాస్తవాలను పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేయడం వల్లే ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు లీగల్ నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత



తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో కూడా ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు తాను కేసీఆర్‌కు లీగల్ నోటీసు పంపించినట్టు గుర్తుచేశారు. ‘తప్పును పదిసార్లు చెబితే నిజం కాదు. రూ.44 కోట్ల టెండర్‌లో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం హాస్యాస్పదం’ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడినప్పుడు తాను గట్టిగా సమాధానం ఇచ్చిన తరువాత తనపై దుష్ప్రచారం ప్రారంభమైందని ఆమె గుర్తు చేశారు.

# సైబర్ నేరాల్లో రికవరీ అంతంతే

- **సొమ్ము పోయిందా తిరిగి రావడం కష్టమే**
- **తెలంగాణలో రోజుకో తరహాలో**
- **సైబర్ మోసాలు**
- **బాధితుల సంఖ్య అధికంగా ఉన్నా రికవరీ అయ్యే సొమ్ము కేవలం 12 శాతమే -**
- **వెల్లడించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే :**



తెలంగాణలో రోజుకో కొత్త తరహాలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. బాధితుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ పోగొట్టుకున్న సొమ్ములో కేవలం 12 శాతం మాత్రమే రికవరీ అవుతున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) వెల్లడించింది. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల్లో ఈ విషయం బయటపడింది.

సైబరాబాద్ పరిధిలోనే 30 శాతం కేసులు

గత ఐదేళ్లుగా నమోదైన కేసులు, బాధితులు కోల్పోయిన సొమ్ము, రికవరీ చేసిన నగదు వివరాలను TGCSB వెల్లడించింది. రాష్ట్రంలో నమోదైన కేసుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే సుమారు 30 శాతం కేసులు నమోదవుతున్నాయి. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు కలిపితే ఈ సంఖ్య 70 శాతానికి చేరుతోంది.

**విదేశాల నుంచి మోసాల నిర్వహణ**

సైబర్ నేరాల ఫిర్యాదులను FIRలుగా నమోదు చేయడంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నప్పటికీ బాధితుల సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చైనాకు చెందిన సైబర్ ముఠాలు మయన్మార్, కంబోడియా, లావోస్ దేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. వాట్సప్ కాల్స్ ద్వారా బాధితులను మోసగిస్తూ నగదు కాజేస్తున్నాయి. కమీషన్ ఆశతో కొందరు తమ బ్యాంకు ఖాతాలను మోసగాళ్లకు అప్పగించడంతో మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు జరుగుతోంది.

**మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు**

ముందుగా బాధితుల నుంచి కాజేసిన నగదును మ్యూల్ ఖాతాల్లో జమ చేస్తారు. అనంతరం ఇతర ఖాతాలకు బదిలీ చేసి ఏటీఎంలు, బ్యాంకుల ద్వారా నగదును ఉపసంహరిస్తారు. చివరకు సేకరించిన మొత్తాన్ని క్రిప్టో కరెన్సీగా మార్చి విదేశాలకు తరలిస్తున్నారు. విదేశాలకు చేరిన సొమ్మును తిరిగి తెప్పించడం కష్టసాధ్యంగా మారుతోంది.

**మోసం జరిగితే వెంటనే ఫిర్యాదు**

సైబర్ మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేయాలి. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. బ్యాంకు శాఖకు సమాచారం ఇచ్చి ట్రాన్సాక్షన్లను వెంటనే నిలిపివేయాలని సూచిస్తున్నారు.

**వేల కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు**

ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఉన్నత విద్యావంతులు, అధికారులు, సాధారణ ప్రజలు కూడా ఈ మోసాలకు బలవుతున్నారు. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి రూ.16 కోట్లు కోల్పోయిన ఘటన నమోదైంది. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు 2025లో రూ.22,495 కోట్లు, 2024లో రూ.22,845 కోట్లు కొల్లగొట్టినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.



## మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

- **ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే**
- **డీలిమిటేషన్‌తో ఎవరికీ అన్యాయం జరగదు**
- **సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని ఎన్డీయే కూటమి పార్టీల నేతలే చెబుతున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ అంశానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తూనే డీలిమిటేషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు, పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి సాయపడుతుందని డీకే అరుణ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆమె సూచించారు. ఈ రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు లభిస్తాయని, దీనికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతును అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇలాంటి చట్టాలు మహిళలకు చాలా మేలు చేస్తాయని ఎంపీ తెలిపారు. రిజర్వేషన్లతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని డీకే అరుణ అన్నారు. అలానే డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేదన్నారు. తాము కూడా దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుందని, ఈ పక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని అన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నాని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్‌కే వదిలేస్తున్నాని కిషన్‌రెడ్డి అన్నారు.



## మూసీ అభివృద్ధిలో భాగస్వాములను చేయండి

- **మూడు ప్రతిపాదనలను పరిశీలించండి**
- **ఉప ముఖ్యమంత్రికి మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితుల వినతిపత్రం**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునర్జీవ పథకంలో భాగస్వాములను చేయాలని, నిర్వాసితులుగా తమకు న్యాయం చేయాలని మధు పార్క్ 'ఎ' బ్లాక్ నిర్వాసితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుకు వినతిపత్రం సమర్పించారు. అందుకు మూడు ప్రతిపాదనలను పరిశీలన కోసం సమర్పిస్తున్నామన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను మధు పార్క్ రిడ్జ్ 'ఎ' బ్లాక్ నిర్వాసితులు సోమవారం మధ్యాహ్నం కలిశారు. మూసీ పునర్జీవ పనులను స్వాగతిస్తున్నామని, అభివృద్ధి పనులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ తమను కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని కోరారు. నిర్వాసితుల ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ మూడు ప్రతిపాదనలను మానవీయ కోణంలో ఆలోచించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి మూసీ కేబినెట్ సబ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలను ఆదేశించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మధు పార్క్ రిడ్జ్ 'ఎ' బ్లాక్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీశైలం, సెక్రటరీ డాక్టర్ కరీముల్లా, సలహాదారు సంజయ్ శుక్ల, లీగల్ అడ్వైజర్ ప్రతాపరెడ్డి, జేఏసీ బి.ఎన్.రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంబాబు తదితరులు ఉన్నారు.



## మహిళా కోటాను వెంటనే అమలు చేయండి

మొదటిపేజీ తరువాయి

డీలిమిటేషన్‌ని ముందుకు తేవొద్దని సూచించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం తీరు సరైనది కాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, లోక్‌సభ డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రస్తావించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ పెట్టారు. జనాభా ఆధారిత డీలిమిటేషన్‌పై ఆందోళనలు చేయొద్దని అన్నారు. దక్షిణ, చిన్న రాష్ట్రా□లకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ తాత్కాలిక రాజకీయ లాభమని, కానీ దేశానికి తీరని నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ప్రయోజనం.. పార్టీ ప్రయోజనాల కంటే ముఖ్యమైనదని చెప్పారు. పోరాటా విధానానికి ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని సూచించారు. డీలిమిటేషన్‌పై అన్ని పార్టీలతో చర్చించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## మరోమారు ఎదురు కాల్పులు

- **మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి**
- **అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్**

**రాయ్‌పూర్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాం కేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# గాలి మోటార్లలో సీఎం, మంత్రుల టూర్లు

మొదటిపేజీ తరువాయి




సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు లేక పంట దళారుల పాలవుతున్నదని, శనగలపై ఎకరానికి రూ.10 వేల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీ పూర్తిగా బోగస్ అని, నేడు కనీస మద్దతు ధరకూ దిక్కులేదని వ్యాఖ్యానించారు. ఏటిగడ్డ సంఘం తదితర గ్రామాల రైతులు శనగలు కొనడం లేదని తమ దృష్టికి తేవడంతో ఇక్కడి డీసీఎంఎస్ సెంటర్‌కు వచ్చామని, రైతులను, నిర్వాహకులను అడిగితే కోటా అయిపోయిందని చెబుతున్నారని తెలిపారు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు గల్లీకి ఎక్కువ.. ఢిల్లీకి తక్కువ అన్నట్లుగా తయారయ్యారు.. గాలి మోటార్లలో కేరళ, ఢిల్లీ పర్యటనలు చేస్తూ బిజీగా ఉన్న వారికి రైతుల కష్టాలు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. సదాశివపేటలో కొత్తగా శనగలు కొనకపోగా, ఇప్పటికే కొన్న వాటికి బిల్లులు కావడం లేదన్నారు. బస్తాలు ఖాళీ చేసి రైతులకే వెనక్కి ఇచ్చేస్తున్నారని, వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నామని మొగలయ్య లాంటి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. మార్కెటింగ్ శాఖ మంత్రి, సివిల్ సప్లైస్ మంత్రి, ముఖ్యమంత్రి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 60 వేల క్వింటాళ్ల శనగలు రైతుల దగ్గర ఉన్నాయి.. వెంటనే రూ.5870 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు బయట అమ్ముకుని క్వింటాల్‌కు రూ.1000 చొప్పున, ఎకరానికి రూ.10 వేలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లో మక్కజొన్న పండితే సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు.. సంచులు లేవని టోకెన్లు ఆపేశారని రైతులు చెబుతున్నారు.. మద్దతు ధర రూ.2400 ఉంటే రూ.16001700లకే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు అని వివరించారు. జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయమే తీసుకోలేదన్నారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి సగం ధరకే జొన్నలు అమ్ముకునే దుస్థితి వచ్చిందని, వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్‌లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు ఆ మాటను బోగస్ చేసిందన్నారు. మక్కలు, కందులు, శనగలు, జొన్నలకు బోనస్ ఇవ్వడం లేదంటూ కనీసం సన్న వడ్లకైనా ఈ యాసంగిలో బోనస్ ఇస్తారా లేదా అనేది స్పష్టం చేయాలన్నారు. ముఖ్యమంత్రి టూర్లు ఆపి రైతుల కష్టాల మీద సమీక్షించాలని హితవు పలికారు. భూములు, కాంట్రాక్టులు, కమీషన్ల మీద రివ్యూలు చేస్తారు తప్ప గరీబ్ రైతుల కోసం మీకు సమయం దొరకదా అని నిలదీశారు. కొనుగోళ్లు ఆగిపోయాయన్న కనీస సమాచారం ఇంటెలిజెన్స్ మీకు చెప్పడం లేదా అన్నారు. ఇక్కడ మల్లేశం అనే రైతు చెబుతున్నాడు.. రోజుకు 10 గంటల కరెంటే ఇస్తున్నారని. పొద్దున ఎనిమిదింటికి కరెంటు వస్తోందని రైతులు వాపోతున్నారు. కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను మద్దతు ధరకు కొనరు.. మీ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా అని అడిగారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి జొన్నలు, పొద్దుతిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కోటా పేరుతో ఆగిపోయిన శనగల కొనుగోలును వెంటనే మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే కేంద్రాలు తెరిచి సన్న వడ్లకు గత యాసంగితోపాటు, ఈ యాసంగి బోనస్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధురాలిపై దాడి

- **రోకలిబండతో బాదిన దుండుగులు**
- **బంగారం దోచుకుని పరార్**

**కామారెడ్డి, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**



కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## ఆశాకు క్రికెటర్ సచిన్ నివాళి

**ముంబై, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళులు అర్పించాడు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలా కాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగాయి. ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ముంబైలోని నివాసంలో ఉంచగా పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు..

## సమ్మెపై కార్మికులు ఆలోచించాలి: పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**


తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాక ర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది .

# నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

- **సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, సిరి న్యూస్‌టుడే:**

నాంపల్లి రెడ్‌హి ల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు



గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

- **22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ ప్రకటన**
- **ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ , సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని జేఏసీ తెలిపింది.

ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్*
సమ్మె నివారణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం ముందుకు 32 డిమాండ్లు పెట్టామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ఈ నెల 9న లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జేఏసీ నేతలు సమావేశమయ్యారు. ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్మిక శాఖకు, యాజమాన్యానికి సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు.



హామీలు అమలు చేయాలని డిమాండ్* కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఛైర్మన్ ఈదురి వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ విస్తరణ పేరుతో సంస్థను నిర్వీర్యం చేయవద్దని తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల వల్ల గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు.

పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుంది*
తమ డిమాండ్లను పరిష్కరించకపోవడం వల్లనే సమ్మె దిశగా వెళ్లాల్సి వస్తోందని వెంకన్న తెలిపారు. ఒక వేళ సమ్మె జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమస్యలకు పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్*
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు. లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల ఇచ్చే రూ.350 కోట్ల నిధులను ఎలాంటి కోతలు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు

# రేడియం స్టిక్కర్ల దందాపై రవాణా శాఖ వెనక్కి!

- వంద కోట్ల మాయాజాలంపై 'సిరి న్యూస్' కథనానికి స్పందన
- సోమవారం నుంచి పాత పద్ధతిలోనే
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- కేవలం ఐదు కంపెనీలకే టెండర్ల ధారాదత్తంపై ప్రజాగ్రహం
- వెలుగులోకి తెచ్చిన 'సిరి న్యూస్'కి ప్రశంసల జల్లు







**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

'సిరి న్యూస్' ప్రచురించిన కథనం రవాణా శాఖలో పెను సంచలనాన్ని సృష్టించింది. 'రేడియం స్టిక్కర్ @ 100 కోట్ల మాయాజాలం' అనే శీర్షికతో వెలుగులోకి వచ్చిన అవినీతి బాగోతంపై ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. ప్రజాక్షేత్రంలో వెల్లువెత్తిన నిరసనలు, వాహనదారుల ఆగ్రహాన్ని పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు, వివాదాస్పదమైన కొత్త నిబంధనలను పక్కనపెట్టి, పాత పద్ధతినే కొనసాగించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు కంపెనీలకే టెండర్లను కట్టబెట్టి, సామాన్య వాహనదారులపై భారం మోపుతూ, పరోక్షంగా ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూరుస్తున్న వైనాన్ని ఈ కథనం సాక్ష్యాధారాలతో సిరి న్యూస్ ఎండగట్టింది. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు వాహనదారుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవ్వడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ప్రజాక్షేత్రంలో పెల్లుబికిన ఆగ్రహాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు, వివాదాస్పదమైన కొత్త విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించారు.

**పాత పద్ధతిలోనే..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు రవాణా శాఖ కీలక ప్రకటన చేస్తూ, సోమవారం నుంచి పాత పద్ధతిలోనే స్టిక్కరింగ్ ప్రక్రియను కొనసాగించనున్నట్లు స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట పడటంతో పాటు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవస్థలు వాహనదారులకు తప్పనున్నాయి. సామాన్యుల పక్షాన నిలబడి అక్రమాలను కళ్ళకు కట్టినట్లు చూపిన 'సిరి' పత్రికా ప్రభావానికి ఇది నిదర్శనమని, ఈ నిర్ణయం లక్షలాది మంది ఆటో, కారు మరియు కమర్షియల్ వాహన యజమానులకు పెద్ద ఊరటనిస్తుందని రవాణా రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## 12 ఏళ్లుగా హెల్మెట్ అలవాటు

### గ్రామానికి ఆదర్శంగా నిలిచినా రాములు



**రామాయంపేట, (నిజాంపేట)ఏప్రిల్ 13 (సిరి న్యూస్ )**

నిజాంపేట మండలం నంద గోకుల్ గ్రామానికి చెందిన రాములు (80) అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా ద్విచక్ర వాహనం నడిపే ప్రతిసారి హెల్మెట్ ధరించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న దూరం అయినా, పెద్ద ప్రయాణం అయినా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన నిరంతరం హెల్మెట్ వినియోగాన్ని కొనసాగిస్తున్నారు. రోడ్డు భద్రతపై ఆయన చూపుతున్న చిత్తశుద్ధి గ్రామస్థులకు ప్రేరణగా మారింది.ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు రాములు ను అభినందించారు. హెల్మెట్ వినియోగంలో క్రమశిక్షణ పాటిస్తున్నందుకు శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ప్రాణరక్షణలో హెల్మెట్ కీలకమని, ప్రతి ఒక్కరూ రాములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇటువంటి వ్యక్తుల వలన సమాజంలో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

## సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం అంబేద్కర్ త్యాగం మరువలేనిది

### మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి.

**రామాయంపేట, ఏప్రిల్ 13(సిరి న్యూస్ )**



భారత రత్న, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ఆయనకు నా హృదయ పూర్వక నివాళులు అర్పిస్తున్నానని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తెలిపారు సోమవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి ఆయన చేసిన కృషి మరియు భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర చిరస్మరణీయమైనదన్నారు.ఈ పుణ్యదినాన ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి విలువలను కాపాడటానికి మనమంతా కట్టుబడి ఉండాలి. వివక్షలేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాల సాధనకు మనమంతా కృషి చేద్దాం అని పిలుపు నిచ్చారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




**పాపన్నపేట, ఏప్రిల్ 13 (సిరి న్యూస్):**

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ సూచించారు. సోమవారం మండల పరిధి కొత్తపల్లి గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యమని రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.వాహనం నడిపే సమయాల్లో సెల్ ఫోన్ ఉపయోగించవద్దని పేర్కొన్నారు.కాస్త ఏమరపాటు వహించిన ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వాహనాల బ్రేకులు, లైట్లు, ఇతర పత్రాలు సరిగా ఉంచుకోవాలని సూచించారు.vపిల్లలకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూచనలు చేశారు.డీటీఓ వెంకటస్వామి, రూరల్ సీఐ జార్జ్, ఎమ్మార్వో సతీష్ కుమార్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సర్పంచి పద్మజగన్, ఆర్ అండ్ బీ డీఈ వెంకటేశం, ఆర్టీసీ డీవీం సురేఖ, ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్ రావు, డిప్యూటీ ఎమ్మార్వో చరణ్ సింగ్, తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**వెల్దుర్తి ఏప్రిల్ 13,( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ మానేపల్లి లింగాపూర్ హస్తాల్పూర్, గ్రామంలో పిఏసిఎస్ దాన్యం కొనుగోలు కేంద్రాలను , ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించి మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పోసి మోసపోవద్దని అన్నారు. రైతు పండించిన ప్రతి దాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్, వ్యవసాయ అధికారిని ఝాన్సీ, హస్తాల్పూర్,గ్రామ సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, పిఏసిఎస్ సీఈవో అశోక్, రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలతోనే పల్లెల అభివృద్ధి

- అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి
- ఉపాధి హామీ పనుల ప్రారంభం

**రామాయంపేట, ఏప్రిల్ 13(సిరి న్యూస్ )**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలతోనే పల్లెల అభివృద్ధి జరుగుతుందని అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ బి. యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని కొనియాడారు. ఈ పథకాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎంతో దోహదపడుతున్నాయని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు స్థానికంగానే పని దొరుకుతుందని, దీనిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని సర్పంచ్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడకుండా అక్కన్నపేట గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.పనుల నాణ్యత విషయంలో అధికారులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎంఎన్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక






**తూప్రాన్ ఏప్రిల్ 13 సిరి న్యూస్**

తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ మల్కాపూర్ గ్రామాలలో సోమవారం రోజు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా ఇస్లాంపూర్ గ్రామంలో సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య డాక్టర్ అమర్ సింగ్ పోలీస్ సిబ్బంది అన్ని శాఖల ప్రభుత్వ అధికారుల పాలకవర్గ సభ్యులు గ్రామస్తులతో కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యపరంగా పలు సూచనలు ఇచ్చారు. మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన ఆ రవ్ ఆ లైవ్ కార్యక్రమం నిర్వహించారు రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై తూప్రాన్ సిఐ రంగాకృష్ణ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు మద్యం సేవించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు ప్రతి ఒక్క వాహనదారుడు ఇన్సూరెన్స్ తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు గ్రామ సమీపంలో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో గ్రామపంచాయతీ సహకారంతో పోలీసులు పూడ్చారు కార్యక్రమంలో తూప్రాన్ ఎస్ఐ గంగరాజు ఉపసర్పంచ్ స్వామి పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు

# కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

- **మొత్తం నలుగురు సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం.**
- **ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు గడువు.**

**జిన్నారం ఏప్రిల్ 13 సిరి న్యూస్**

గడ్డపోతారం పురపాలక సంఘంలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికకు మున్సిపల్ కమిషనర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మున్సిపాలిటీస్ కో–ఆప్షన్ మెంబర్ రూల్స్–2020 ప్రకారం మొత్తం నలుగురు సభ్యులను కౌన్సిల్ ఎంపిక చేయనుంది. ఇందులో మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న ఇద్దరిని, అల్పసంఖ్యాక వర్గాల (మైనారిటీ) నుండి మరో ఇద్దరిని ఎన్నుకో నున్నారు. నిబంధనల ప్రకారం, ఈ రెండు వర్గాల్లోనూ కచ్చితంగా ఒక్కో మహిళా సభ్యురాలికి అవకాశం కల్పించనున్నారు.

**అర్హతలు..**

పరిపాలన అనుభవం ఉన్న అభ్యర్థులు గతంలో కౌన్సిల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ లేదా వార్డు మెంబర్‌గా ఐదేళ్ల పాటు పనిచేసి ఉండాలి. లేదా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా ఐదేళ్ల అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరితో పాటు కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అడ్వకేట్లు లేదా గెజిటెడ్ హోదాలో పనిచేసి రిటైర్ అయిన అధికారులకు కూడా అవకాశం ఉంది. మైనారిటీ అభ్యర్థుల విషయానికి వస్తే, వారు తప్పనిసరిగా అల్పసంఖ్యాక వర్గానికి చెంది ఉండటంతో పాటు మున్సిపల్ ఓటరు జాబితాలో పేరు కలిగి ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం 21 ఏళ్ల వయస్సు ఉండాలి.

**గడువులోగా దరఖాస్తు చేసుకోండి:**

ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో జతపరిచి, ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ ప్రకటనను ఇప్పటికే మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్లు వెల్లడించారు.

## సింగూరు నుండి సాగునీరు విడుదల పట్ల గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం గౌడ్**

**కొల్చారం ఏప్రిల్ 13 (సిరి న్యూస్)**






కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి గారికి ధన్యవాదములు నాగుల గారి మల్లేశం గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొల్చారం మంజీరా నుండి చిన్న గణపురం నీటి విడుదల కోసం కృషి చేసిన అన్ని వర్గాల ప్రజలకు రైతులకు అన్ని పార్టీల నాయకులకు మరియు ముఖ్యంగా సంబంధిత శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి గారికి గౌరవ ముఖ్యమంత్రి గారికి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి గారికి కొల్చారం మండల పార్టీ పక్షాన కొల్చారం మండల రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గతంలో కూడా ఇలాంటి కష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నీళ్లు వదిలి రైతులు ఆదుతున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉంది. అంతేగాని రైతులను ఇబ్బంది పెట్టే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదు. రైతు బాంధవుడు రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చొరవతో నీటి విడుదలకు సహకరించి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డ్ యజమాని కూడా ధన్యవాదాలు తెలియజేస్తూ.. ఇటినీటి విడుదలతో కొల్చారం మండల పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు ఎంత ఉపయోగకరంగా ఉంటుంది. చేతికొచ్చిన పంట ఎండిపో కుండా నీళ్ల కోసం కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన మంత్రులను సంబంధిత అధికారులను నరసాపురం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి గారి సమక్షంలో కలవడం జరిగింది. ఈ నీటి విడుదల తోడ్పాటులో అన్ని రాజకీయ పార్టీలు మరియు అధికారులు రైతులు కృషి ఎంతో ఉందని సందర్భంగా తెలియజేసి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

# కార్మిక శాఖతో చర్చలు విఫలం

- **ఆర్టీసియన్ల సమ్మె యథాతతం ఆరు రోజులుగా సమ్మె**
- **18 వేలమంది కార్మికుల నిరసన సబ్స్టేషన్ నిర్వహణ బాధ్యతలు ఇంజినీర్లకు**

**హైదరాబాద్ సిరి న్యూస్ (ప్రత్యేక ప్రతినిధి):**





ఒకే సంస్థ ఒకే విధానం అనే నినాదంతో తెలంగాణ విద్యుత్ శాఖలో కొనసాగుతున్న సమ్మె 6 రోజులు పూర్తయ్యింది.ఇటు యాజమాన్యం కాని అటు ప్రభుత్వం కానీ ఆర్టీసియన్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపడంలేదు.కార్మిక శాఖ సమస్య పరిష్కారానికి సోమవారం యాజమాన్యం మరియు ఆర్టీసియన్ ప్రతినిధులతో చర్చలు జరిపింది.తమ సమస్యల పరిష్కారం జరిపే వరకు సమ్మె ఆగదని ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు కార్మిక శాఖ తో జరిగిన చర్చల్లో తమ గళం వినిపించారు.దీనితో యాజమాన్యం తరపున హాజరైన ప్రతినిదులు ప్రభుత్వానికి వివరిస్తామని మరింత గడువు కావాలని కోరారు.ఈ నెల 17వ తేదికి మరోసారి సమావేశాన్ని కార్మిక శాఖ వాయిదావేసింది.యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించకుండా కార్మికులను తొలగిస్తామని భయపెట్టడం పై టీజాక్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు.కార్మిక శాఖ తో సైతం చర్చలు విఫలం కావడం మూలంగా ఆర్టీసియన్ల సమ్మె యథాతదంగా కొనసాగుతుందని జాక్ ప్రతినిధులు సాయిలు,చంద్రారెడ్డి లు ప్రకటించారు.అన్ని ప్రధాన సంఘాలు మద్దతిస్తున్నా ప్రభుత్వం మాత్రం తమ సమస్యలను పట్టించుకోకపోవడం పై కార్మికులు మరింత అసహనంతో ఉన్నారు. ఈ మేరకు ప్రధాన సంఘాలను ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొనేలా వత్తిడి తేవాలని నిర్ణయించారు.ఇందుకోసం కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్నారు.ఒకవైపు శాంతి యుతంగా సమ్మె చేస్తూనే తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలో స్థానిక ఎంఎల్ఏ లకు ,మంత్రులకు, ప్రభుత్వ సలహాదారులకు ఎక్కడికక్కడ వినతిపత్రాలు ఇస్తున్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి శ్రీధర్ బాబుకు,శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కలిసి తమ సమస్య పరిష్కారం చేయాలనీ వినతి పత్రం అందించారు.

**ప్రతిపక్షాలు ప్రజాసంఘాల మద్దత్తు**

ఆర్టీసియన్లు చేపట్టిన సమ్మెలో ప్రతిపక్ష నాయకులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.మాజీ మంత్రి హరీష్ రావు సిద్దిపేటలో ఆర్టీసియన్ల సమ్మెలో పాల్గొని ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.6 రోజులుగా సమ్మె చేస్తున్న కనీసం పట్టించుకోవడం బాధ్యతరహితమని అయన అన్నారు.అన్ని యూనియన్లు సమ్మెలో లేనప్పటికీ ఎప్పటికప్పుడు సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్నారు.

# రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- **రోడ్డు ప్రమాదాల నివారణకు అవేర్నెస్ ప్రోగ్రాం**
- **జిన్నారం పోలీసుల ఆధ్వర్యంలో భద్రత సదస్సులు**

**జిన్నారం ఏప్రిల్ 13 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని జంగంపేట్, జిన్నారం, సోలక్ పల్లి,గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామాలల్లో జిన్నారం పోలీస్ ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగింది.

**ఈ సందర్భంగా జిన్నారం ఎస్సై హనుమంతు మాట్లాడుతూ...**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి రోడ్డు భద్రత, అవేర్నెస్ ప్రోగ్రాం కార్యక్రమాలు సోమవారం జిన్నారం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పన నిర్వహించడం జరిగిందని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై సూచనలు చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరిక జారి చేశారు.వేగ పరిమితులు పాటించాలని వాహనదారులకు సూచిం చారు. రోడ్డు భద్రత లో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని సూచనలు చేపట్టారు.ఈ సమావేశంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ ముదిరాజ్ కౌన్సిలర్లు వాహన దారులు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# CURE పరిధిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు



**రామచంద్రపురం, ఏప్రిల్ 13 (సిరి న్యూస్):**

ప్రజా సేవల మెరుగుదల, పారిశ్రామిక నిబంధనల అమలుపై పర్యవేక్షణలో భాగంగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలో విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌సీ పురం యూనిట్ అధికారులు పటాన్‌చెరు, బొల్లారం పారిశ్రామిక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో పలు పరిశ్రమలు ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ, బాయిలర్ లైసెన్స్, కార్మిక శాఖ అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పారిశ్రామిక భద్రతా ప్రమాణాల్లో లోపాలు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, లీగల్ మెట్రాలజీ నిబంధనల ఉల్లంఘనలు కూడా వెలుగులోకి వచ్చాయి.అదేవిధంగా పటాన్‌చెరు టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.2.65 కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత విభాగాలకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు.ఈ తనిఖీలను విజిలెన్స్ ఎస్పీ శ్రుతకీర్తి ఆధ్వర్యంలో నిర్వహించగా, తహశీల్దార్ మాధవి, ఇన్స్పెక్టర్లు శశికాంత్ రెడ్డి, ప్రశాంత్, ఏజీ హరికృష్ణ, ఏఓ కోటేశ్వర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక లక్ష 90 వేల ఎల్ఓసి పంపిణీ

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం ఏప్రిల్ 13 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తీకి చెందిన కాజిం ఖాన్, బీరంగూడ డివిజన్ పరిధిలోని వందన పురి కాలనీకి చెందిన బండ ప్రభాకర్ లు మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

# ఆరెగూడెం గ్రామం లో ఆరైవ్ అలైవ్ కార్యక్రమము



**వెల్దుర్తి ఏప్రిల్ 13,(సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలంలోని ఆరెగూడెం గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెల్దుర్తి పోలీస్ శాఖవారు గ్రామ సర్పంచ్ వెన్నవరం చైతన్య హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో ఆలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన రోడ్డు భద్రత విషయంలో అవగాహన కార్యక్రమాలను చేయడం జరిగిందని ఈ నేపథ్యంలో వాహనాలపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకొని ప్రయాణాలు చేయాలని మరి ముఖ్యంగా తాగి వాహనాలు నడపరాదని సూచించారు. పోలీసులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ప్రయాణాల విషయంలో తగు జాగ్రత్తలను తీసుకొని ప్రయాణించాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నవరం చైతన్య హనుమంత్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు, పోలీస్ శాఖ వారు, గ్రామస్తులు, మహిళా సంఘాలవారు, తదితరులు పాల్గొన్నారు.

# 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

## రోడ్డు భద్రతపై అవగాహన



**రామచంద్రపురం, ఏప్రిల్ 13,(సిరి న్యూస్):**

"అరైవ్ అలైవ్" కార్యక్రమం తొలి రోజు సందర్భంగా పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పోచారం గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యత, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, 13 మంది సభ్యులతో రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేసి వాట్సాప్ గ్రూప్ రూపొందించారు. కార్యక్రమంలో సుమారు 30 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రూల్స్ పాటిస్తేనే రక్షణ

## ఎస్సై రాజేష్ నాయక్




**మునిపల్లి, ఏప్రిల్ 13(సిరి న్యూస్)**

మునిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజల భద్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించడం అవసరమని తెలిపారు.ఎవరైనా దురదృష్ట వశాత్తూ రోడ్డు ప్రమాదానికి గురైతే, మానవత దృక్పథంతో వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అలా సహాయం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25,000 నగదు బహుమతి అందిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మమత నాగేష్, గ్రామ కార్యదర్శి సంతోష, గ్రామ పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అసలు ప్రభుత్వం ఉందా?

## ఫోన్ చేస్తే పనులయ్యే రోజులు పోయాయి
## సీఎంకు ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేదు
## నిధుల లేమితో ఆగిపోయిన ప్రాజెక్ట్ పనులు
## కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు
## మంత్రులపై పోచారం శ్రీనివాసరెడ్డి ఆగ్రహం
## సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద అర్ధరాత్రి వరకు ప్రజలతో ఎమ్మెల్యే చర్చ

**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**



నిజామాబాద్ జిల్లా సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు నిలిచిపోవడంపై ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రాజెక్ట్ ప్రాంతంలో ప్రజలతో కలిసి పరిస్థితిని సమీక్షించిన ఆయన, ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అసలు ప్రభుత్వం ఉందా? మంత్రులు ఫోన్ లేపరు' అంటూ పోచారం వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలో ఫోన్ చేస్తే పనులు జరిగేవని, ఇప్పుడు మాత్రం నిధులు రావడం లేదని, మంజూరైన పనులు పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ ప్రాజెక్ట్ పనులు నిలిచిపోవడంతో స్థానిక ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన వ్యక్తమవుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, అక్కడి నుంచే మంత్రులకు ఫోన్ చేసినా స్పందన రాలేదని ఆరోపించారు. అనంతరం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. 'నేను సీనియర్ శాసనసభ్యుడిని, 20 ఏళ్లు మంత్రిగా పని చేశాను. అయినా కనీస గౌరవం లేకుండా మంత్రులు ఫోన్లు లేపడం లేదు. ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలే ఫోన్ ఎత్తకపోతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి?' అంటూ పోచారం ప్రశ్నించారు. పనులు చేయనప్పుడు రాజకీయాల అవసరమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పనులు ఆగిపోవడంతో అక్కడ తుమ్మ చెట్లు పెరిగిపోతున్నాయని, ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించలేకపోతున్నామని చెప్పారు. కాంట్రాక్టర్లను బతిమిలాడి పనులు చేయిస్తున్నా, వారికి చెల్లింపులు చేయలేకపోతున్నామని వెల్లడించారు. 'ఈ వయసులో మంత్రుల కాళ్లు మొక్కాలా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకత్వం స్పందించింది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పోచారం కాస్త సంయమనం పాటించాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మీటింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్లు ఎత్తలేమని, అయితే తర్వాత మాట్లాడతామని తెలిపారు. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

# జనగణన ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి





- **జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్ల నియామకం**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్ ఏప్రిల్ 13(సిరిన్యూస్)**

జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్ వైజర్లు మరియు ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.సోమవారం హైదరాబాద్ నుండి కులగణన సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు నిర్వహించబడనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగా హన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్లను నియమించామని వివరించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగనన సూపరింటెండెంట్ గఫార్ , ఈడియం సందీప్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్

- **తెలంగాణ వ్యాప్తంగా గ్రీష్మ ప్రతాపంతో పెరిగిన వినియోగం**

**హెదరాబాద్, సిరి న్యూస్ ,(ప్రత్యేక ప్రతినిది):**

పెరుగుతున్న ఎండలు అంతకు మించి పెరిగిన ఉక్కపోత కారణంగా తెలంగాణాలో విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగింది .గత వారం రోజులుగా గ్రీష్మ ప్రతాపం రోజు రోజుకు పెరుగుతూ వస్తుంది .సోమవారం నాటికీ 40 డిగ్రీల మార్క్ దాటింది.విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పై పైకి వెలుతుంది. విద్యుత్ డిమాండ్ 4,119 మెగావాట్లకు చేరుకోగా విద్యుత్ వినియోగం 89.25 మిలియన్ యూనిట్లకు చేరుకుంది.అంటే ఆల్‌టైమ్ రికార్డుకు రెండు మిలియన్ యూనిట్ల దూరంలోనే ఉన్నది. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ వినియోగం 2024 మే 29వ తేదీన 91.68 మిలియన్ యూనిట్లు ఆల్‌టైమ్ రికార్డుగా ఉన్నది. ఎప్పుడో మే నెల చివరలో రావాల్సిన డిమాండ్, వినియోగం ఈ ఏడాది ఏఫ్రిల్ రెండవ వారంలోనే రావడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏఫ్రిల్ 10 వ తేదీన 89.25 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగంతో ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. ఈ నెలాఖరు వరకు విద్యుత్ వినియోగం, డిమాండ్‌లు గతంలో ఉన్న ఆల్‌టైమ్ రికార్డును అధిగమించే అవకాశం ఉందని విద్యుత్ ఉన్నతాధికారులు బావిస్తున్నారు. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 5 వేల మెగావాట్లు దాటుతుందని, విద్యుత్ వినియోగం 110 మిలియన్ యూనిట్ల వరకు చేరుకునే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ నిపుణులు బావిస్తున్నారు. ఈ ఏడాది ఏఫ్రిల్ నెలారంభం నుంచే అంటే 1వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు విద్యుత్ వినియోగం 84 మిలియన్ యూనిట్లను క్రమం తప్పకుండా జరుగుతుంది. విద్యుత్ డిమాండ్ కూడా నాలుగు వేల మెగావాట్లకు అటు ఇటుగా నమోదు అవుతుంది. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తుంటే ఈ నెల, వచ్చే నెలలో అకాల వర్షాలు రాకపోతే విద్యుత్ డిమాండ్, వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంటుందని విద్యుత్ అధికారులు అంటున్నారు.

**నెలముందే !**

మే చివర వరకు ఉండాల్సిన డిమాండ్ ఏప్రిల్ మొదటి వారానికే చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది.వినియోగం రోజు రోజుకు పెరుగుతుండటం మూలంగా ఆమేరకు విద్యుత్ శాఖ అప్రమత్తమైంది .గతంలో ఎప్పుడు లేని విధంగా వేసవి ఆరంభంలోనే ఎండల తీవ్రత పెరగడంతో పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే మూడు, నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, ఏఫ్రిల్ రెండవ వారం నాటికి 40 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరువ కావడం గమనార్హం.సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఎండల తీవ్రత వల్ల ఒక వైపు వేడి, మరో వైపు ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీనితో ఏసీలు, కూలర్ల కు పని చెబుతున్నారు. దీనితో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ 4,000 మెగావాట్లకు చేరుకుంది. విద్యుత్ వినియోగం 89.25 మిలియన్ యూనిట్లను దాటుతుంది. దీనితో విద్యుత్ వినియోగదారుల మీటర్లు గిర్రున తిరుగుతుండడంతో బిల్లుల మోత మోగుతుంది.గతంలో ఎప్పుడు లేని విధంగా ఎండల తీవ్రత వల్ల ఏఫ్రిల్‌లోనే విద్యుత్ డిమాండ్, విద్యుత్ వినియోగం భారీగా పెరిగి విద్యుత్ మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. మార్చిలో ఆరంభమైన ఎండలు ఏఫ్రిల్ నాటికి తీవ్ర రూపం దాల్చాయి. మధ్యాహ్నం పూట ఎండల తీవ్రత పెరగడంతో పాటు రాత్రి సమయాల్లో ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కానీ గత పది పన్నెండు రోజులుగా మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత భారీగా ఉండడమే కాకుండా రాత్రి సమయంలో కూడా వేడి పెరిగింది. దీనితో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేడి, ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతు ఉపశమనం కోసం ఏసీలను, కూలర్లను నడిపిస్తున్నారు. దీనితో విద్యుత్ మీటర్లు గిర్రున తిగరడమే కాకుండా విద్యుత్ డిమాండ్ ఎన్నడు లేని స్థాయికి చేరిపోతుంది. విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో రికార్డు అవుతుంది. సాధారణంగా ప్రతి యేటా విద్యుత్ డిమాండ్ పది నుంచి పదిహెనుశాతం పెరుగుతుంది. అయితే ఈ ఏడాది విద్యుత్ వినియోగం గత సంవత్సరంతో పోలిస్తే ఎక్కువగా ఉండడం గమనార్హం. గత ఏడాది ఇదే సమయానికి విద్యుత్ డిమాండ్ 3,700 మెగావాట్లకు చేరుకోగా, ఈ ఏడాది ఇదే సమయంలో 4,000 మెగావాట్లకు చేరుకుంది. విద్యుత్ వినియోగం కూడా గత ఏడాది ఇదే సమయానికి 70 నుంచి 79 మిలియన్ యూనిట్లు ఉండగా, అదే సమయానికి 89 మిలియన్ యూనిట్లను దాటిపోయింది. ఇదే సమయంలో విద్యుత్ రంగంలో కీలకంగా ఉన్న ఆర్టిజన్లు సమ్మె బాట పట్టారు. ఆర్టిజన్లు సమ్మె చేస్తుండగా విద్యుత్ అధికారులు మాత్రం డబల్ డ్యూటీలు చేస్తు విద్యుత్ సరఫరాలో ఇప్పటి వరకు అంతరాయం లేకుండా చేస్తున్న కృషి ఫలిస్తుంది. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ప్రతి రెగ్యులర్ ఉద్యోగికి బాధ్యతలను అప్పగించారు. దీనితో గత ఆరు రోజులుగా ఆర్టిజన్లు సమ్మె చేస్తున్నప్పటికి ఏలాంటి అంతరాయం లేకుండా అధికారులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా విద్యుత్ డిమాండ్, విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో చాలా మంది గృహాజ్యోతి పథకానికి దూరం అవుతున్నారు. రెండు వందల యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారికే గృహాజ్యోతి పథకం అమలవుతుంది. 200 యూనిట్లకు ఒక్క యూనిట్ పెరిగినా గృహాజ్యోతి పథకంకు అర్హులు కారు. అయితే మారిన వాతావరణ పరిస్థితులతో విద్యుత్ డిమాండ్, విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ పరిధిలో అన్ని వర్గాల వినియోగదారులు 65 లక్షలకు పైగా ఉన్నారు. ఇందులో 11 లక్షల మంది వినియోగదారులు మాత్రమే గృహాజ్యోతికి అర్హులు అవుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగంతో చాలా మంది గృహాజ్యోతి పథకానికి దూరం అవుతున్నారు.

# ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- **ఝూన్సీ లింగాపూర్ గ్రామసభలో ఆర్డిఓ రమాదేవి**

**రామాయంపేట, ఏప్రిల్ 13(సిరి న్యూస్ )**



ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మెదక్ ఆర్డిఓ రమాదేవి సూచించారు. సోమవారం నాడు రామాయంపేట మండలం ఝూన్సీ లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ మానేగల్ల రామకృష్ణయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డిఓ రమాదేవి గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, అరైవ్ అలైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ లేకుండా ప్రయాణించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. తాసిల్దార్ రజిని కుమారి, ఎస్సై బాలరాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పుకోవచ్చని వివరించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు రోడ్డు భద్రత నియమాలపై పలు సూచనలు చేశారు.

**ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విన్నవించిన మహిళలు**


ఈ సభలో పలువురు మహిళలు తమకు ఇండ్లు మంజూరు కాలేదని ఆర్డిఓ దృష్టికి తీసుకువచ్చారు. తమ ఆర్థిక పరిస్థితి చాలా ఘోరంగా ఉందని, వెంటనే ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన తుడుం భూలక్ష్మి మాట్లాడుతూ తన దయనీయ స్థితిని వివరించి, స్వయంగా తన ఇంటికి వచ్చి పరిశీలించాలని అధికారులను వేడుకున్నారు. తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేటప్పుడు నిబంధనల పాటిస్తామని గ్రామస్తులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శాంతినికేతన్ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయి ఖ్యాతి

- **విద్యార్థుల విజయంపై యాజమాన్యం హర్షం**

**సత్తుపల్లి(సిరి న్యూస్):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాల మరోసారి తన ప్రతిభను రాష్ట్రస్థాయిలో చాటుకుంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోనే ప్రఖ్యాతి గాంచారు. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి టాప్ ర్యాంకులను సాధించారు. ఈ విజయంతో కళాశాల విద్యార్థులు మాత్రమే కాకుండా యాజమాన్యం, లెక్చరర్లు, తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా నిరంతరం మంచి ఫలితాలు సాధిస్తున్న శాంతినికేతన్ జూనియర్ కళాశాల ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా విద్యా రంగంలో తన ప్రత్యేక స్థానం నిలుపుకుంది. విద్యార్థుల కృషి, లెక్చరర్ల మార్గదర్శకత్వం, యాజమాన్యం అందించిన సదుపాయాల సమన్వయంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని కళాశాల ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతంగా దృష్టి పెట్టి బోధన అందించడం, సమయానికి పరీక్షలు నిర్వహించడం, ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం వంటి అంశాలు విజయానికి కీలక కారణాలుగా నిలిచాయి. ఎంపీసీ విభాగంలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సొంతం చేసుకున్నారు. అదేవిధంగా బైపీసీ విభాగంలో జీవశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీలో మెరుగైన మార్కులు సాధించి విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ఫలితాలతో అనేక మంది విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ ప్రవేశాలకు మంచి అవకాశాలు పొందనున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని ప్రోత్సహించింది. అలాగే ఈ ఫలితాల వెనుక ఉన్న లెక్చరర్ల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించింది. సత్తుపల్లి పట్టణ ప్రజలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. స్థానికంగా ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మొత్తంగా శాంతినికేతన్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాధించిన ఈ విజయాలు ఆ విద్యాసంస్థకు మరింత ప్రతిష్టను తీసుకు వచ్చాయి. విద్యార్థుల ప్రతిభ, కృషి, క్రమశిక్షణతో సాధించిన ఈ విజయాలు ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని చెప్పవచ్చు.




# నేరాల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- **490 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి**

**ఆదిలాబాద్(సిరి న్యూస్):** నేరాల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని, ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిఘా నీడలో ఉన్న ప్రాంతాల్లో నేరాలు చేయడానికి నేరస్తులు భయపడతారని, ప్రజలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిష్ణాతులైన సిబ్బంది 24 గంటల పాటు అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉంటారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా నూతనంగా 490 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో అదనంగా 207 కెమెరాలు, జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో 283 కెమెరాలను అందు బాటులోకి తీసుకువచ్చారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మొత్తం సీసీ కెమెరాల సంఖ్య 700కు చేరింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీలు బి.సురేందర్ రావు, పి.మౌనిక, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు శరవేగంగా చేపట్టాలి

- **వచ్చే 50 ఏళ్లు నిలిచేలా పనులు జరగాలి**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**
- **సింగూరు ప్రాజెక్టు సేఫ్టీ పనుల పరిశీలన**
- **టూరిజం పనులపై అధికారులతో సమీక్ష**
- **ఇంటిగ్రేటెడ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశం**



**జోగిపేట, ఏప్రిల్ 13, (సిరి న్యూస్):**


సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు శరవేగంగా పూర్తి చేయాలని, వచ్చే 50 ఏళ్లు నిలిచేలా పనులను చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఇరిగేషన్అధికారులను ఆదేశించారు. సోమవారం మంత్రి సింగూర్ ప్రాజెక్టు వద్ద జరుగుతున్న డ్యామ్ సేఫ్టీ పనులను పరిశీలించారు. మరమ్మత్తు పనులలో జరుగుతున్న జాప్యంపై ఆరా తీశాడు ప్రస్తుతం ప్రాజెక్టులో లో 7 టీఎంసీల నీళ్లు ఉన్నాయని అందువలన కొద్దిగా పనులు జాప్యం జరుగుతుందని అధికారులు మంత్రికి తెలిపారు. నీళ్లు తగ్గుతున్న కొద్దీ పనుల్లో వేగం పెంచుతామని పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల మేరకు నిర్మాణ పనులను చేపట్టాలని మంత్రి సూచించారు. సింగూర్ ప్రాజెక్టు సిలారపు రాజనర్సింహ కాలువ (ప్రధాన కాలువ) లైనింగ్ పనులను పరిశీలించారు.

### టూరిజం అధికారులతో సమీక్ష

సింగూర్ ప్రాజెక్టులో ఉన్న ఐలాండ్ అభివృద్ధిపై టూరిజం అధికారులతో చర్చించారు. సింగూరు ప్రాజెక్టు డ్యాం బ్యూటిఫికేషన్ పై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఐలాండ్ అభివృద్ధి బోటింగ్, పార్కులు, గార్డెన్ బ్యూటిఫికేషన్, కాటేజీల నిర్మాణం, రెస్టారెంట్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లపై ఇరిగేషన్, టూరిజం అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించి చర్చించారు. పనుల వేగవంతం పై అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారంపై చర్చించారు. సింగూర్ డ్యాం సేఫ్టీ పనులతో పాటు టూరిజం అభివృద్ధిపై ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెద్దారెడ్డి పేట లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై మంత్రి సమీక్షించారు. అందోల్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్ తో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయడం పై అధికారులతో చర్చించారు. ఆందోల్ నియోజకవర్గం లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

### మంత్రి దృష్టికి ఇసుక క్వారీ ఇబ్బందులు

ప్రాజెక్టు Æ రివిట్మెంట్ కాల్వ సిమెంట్ లైనింగ్ పనుల గుత్తేదారుల సమస్యలు ఏమైనా ఉన్నాయా మంత్రి ప్రశ్నించగా ఇసుక సమస్య ఉందని మాకు కేటాయించిన క్వారీలు ఇసుక తక్కువగా ఉందని సూచించారు. దీంతో మంత్రి జోక్యం చేసుకొని డిఆర్ఓ పాండుకు ఇసుక సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల, స్పోర్ట్స్ ఫెసిలిటీస్ కల్పన కు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఎస్సీ కలిసి సింగూరు కట్ట పనులను కాల్వ సిమెంట్ లైనింగ్ ను పరిశీలించారు మరమ్మతులు తొందరగా పూర్తి చేస్తే సాగు సాగు నీటికి శివారులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను పరిశీలించారు ఇంటిగ్రేటెడ్ స్కూల్లో కూడా పనుల వేగం పెంచాలని గుత్తేదరులకు సూచించారు మంత్రి వెంట నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# ప్రజల దాహం తీర్చడం పుణ్య కార్యం




**నేరడిగొండ(సిరి న్యూస్):** వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చడం పుణ్య కార్యమని నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్ లు అన్నారు. సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ నాయకుడు సాబ్లే సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. సాబ్లే సంతోష్ సింగ్ అనేక సామాజిక కార్యక్రమాల్లో ముందుండి సేవలు అందిస్తున్నటుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సముద్రాల రతీష్, చిప్పరి రాజేశ్వర్, సాబ్లే భావ్ సింగ్, కచ్కడ్ నాందేవ్, సాయికిరణ్, బాల్ సింగ్, శ్రీకాంత్, రవి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి పెళ్లికి గ్రామస్తుల ఆర్థిక సహాయం



**నేరడిగొండ(సిరి న్యూస్):** మానవత్వం ఇంకా గ్రామాల్లో జీవిస్తోందని నేరడిగొండ మండలంలోని రోల్ మామడ గ్రామస్తులు నిరూపించారు. గ్రామానికి చెందిన అర్క నాగుబాయి– రాములు దంపతుల కుమార్తె మంజుల వివాహం జరపడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పెళ్లి ఖర్చులకు చేయూతనివ్వాలని భావించిన గ్రామ ప్రజలు కలిసి రూ.40వేల నగదును సేకరించారు. సోమవారం ఈ మొత్తాన్ని పటేల్ యాదవ రావు, పూజారి లింగు, మహాజన్ రామదాస్, గ్రామ సర్పంచ్ తోడసం శంకర్ తదితరులు గ్రామ ప్రజల సమక్షంలో పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడు, వారి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. గ్రామంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే అందరూ కలిసికట్టుగా సహాయం చేయడం మంచి సాంప్రదాయమని పలువురు కొనియాడారు. గ్రామస్తుల సహాయానికి మంజుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పోడు రైతుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం



**కాగజ్నగర్(సిరి న్యూస్):** పోడు రైతులపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తుతున్నామని సిర్పూర్ మాజీ ఎంపీపీ మాలతి అన్నారు. సోమవారం పలువురు నాయకులు, గ్రామస్తులతో కలిసి పోడు రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు ఇచ్చి వారి జీవనోపాధికి భరోసా కల్పించిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు రైతుల కుటుంబాలకు కేవలం రెండు నుంచి మూడు ఎకరాల భూమి మాత్రమే ఉండగా, అదే వారి జీవనాధారమని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఆ భూములను కూడా అధికారులు తీసుకునే ప్రయత్నం చేయడం పోడు రైతుల జీవన హక్కులను హరించడమే అవుతుందని మండిపడ్డారు. పోడు రైతుల హక్కుల పరిరక్షణ కోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో పోరాటాన్ని కొనసాగిస్తామని, తమ భూములను కాపాడుకునే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.



## ముత్యంలాంటి చర్మ సౌందర్యం కావాలి..

# ఇవి ట్రై చేయండి..



అందంగా కనిపించాలని ఎవరు అనుకోరు. ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. మనం వెళ్తుంటే అందరూ మనల్ని చూసి నోరెళ్లబెట్టాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ వాతావరణం, ఆహారం, జీవనశైలి వల్ల చర్మ సౌందర్యం విషయంలో ఎప్పుడూ ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంటుంది. ఈ సమస్య ఒకరిద్దరికి కాదు దాదాపు 90శాతం మంది ఎదుర్కుంటున్నట్లు నిపుణులు చెప్తున్నారు. ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడినా లాభం ఉండటం లేదని, ముఖంపై మచ్చలు రావడం, చర్మం ముదిరిపోయినట్లు అవడం, మొటిమలు, చిన్నచిన్న గుల్లలు వంటి రావడం జరుగుతుందని సౌందర్య ప్రియులు బాధపడిపోతుంటారని నిపుణులు అంటున్నారు. చాలా మందికి వారు వినియోగించే బ్యూటీ ప్రొడక్ట్స్ వల్లే సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయని చెప్తున్నారు. మరికొందరైతే మచ్చలేని చర్మం కోసం హోమ్ రెమెడీస్ మొదలు కనిపించిన ప్రతి మార్గాన్ని వాడేస్తారు. అయితే ఫలితం పెద్దగా కనిపించదు. చాలా వరకు మన ఆహారం వల్లే ఇటువంటి సమస్యలు వస్తుంటాయి. చెడు ఆహారపు అలవాట్లు ఉన్నవారిలో ఈ సమస్యలు మరీ అధికంగా ఉంటాయి. మన ఆహారపు అలవాట్లకు తోడు.. వాతావరణం కూడా కలిస్తే.. ఒక ముఖమంతా దారుణంగా కనిపిస్తుంటుంది. అయితే ఈ సమస్యలకు హోమ్ రెమెడీస్ వినియోగించడం ద్వారా ముత్యంలాంటి మచ్చలేని చర్మాన్ని పొందవచ్చని చర్మ సౌందర్య నిపుణులు చెప్తున్నారు. అందులోనూ బియ్యం పిండిని వినియోగించడం ఇంకా మంచిదని అంటున్నారు. మరి ఆ బియ్యం పిండిని ఎలా వాడాలో చూద్దామా..

**డార్క్ సర్కిల్స్:** బియ్యం పిండిలో కాస్తంత పసుపు, టమాటా రసం కలపాలి. దాన్ని కంటి చుట్టూ అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత ఒక గంటసేపు లేదా అది ఆరిపోయే వరకు వదిలేయాలి. ఆ తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటితోనే కడుక్కోవడం శ్రేయస్కరం. ఈ మిశ్రమంలో వాడే బియ్యం పిండి, పసుపు, టమాటా రసం మూడింటిలో చర్మాన్ని మెరిసేలా చేసే లక్షణాలున్నాయి. కాబట్టి ఇది డార్క్ సర్కిల్స్‌కు మంచి పరిష్కారంగా చెప్తారు నిపుణులు.

**ముఖ సౌందర్యానికి:** ఆముదం నూనె, 2 టేబుల్ స్పూన్ల బియ్యం పిండి తీసుకుని బాగా కలుపుకోవాలి. అది పేస్టులా అవుతుంది. దాన్ని మొటిమలు, మచ్చలపై అప్లై చేసి నెమ్మదిగా మసాజ్ చేయాలి. 30 నిమిషాలు అలా వదిలేసి తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడుక్కోవాలి. ఆముదంలో కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని మరమ్మతు చేయడానికి, మచ్చలను తొలగించడానికి సహాయపడతాయి.

హైపర్ పిగ్మెంటేషన్: ఈ సమస్యకు బియ్యం పిండి బాగా ఉపయోగపడుతుంది. ఈ ఫేస్ ప్యాక్ తయారు చేయడానికి నిమ్మకాయ, బియ్యం పిండిని ఉపయోగించండి. ఈ రెండు పదార్థాలను మిక్స్ చేసిన తర్వాత అందులో కొన్ని చుక్కల రోజ్ వాటర్ మిక్స్ చేసి ఆ ప్యాక్ ను ముఖానికి, మెడకు అప్లై చేయాలి. 20 నిమిషాల పాటు అలా వదిలేసి తరువాత శుభ్రం చేసుకోవాలి. ఇలా మీరు రెండు మూడు సార్లు చేశాక మీకు ఎంతో మార్పు కనిపిస్తుంది.



# బరువు త్వరగా తగ్గాలంటే వాకింగ్ చేయాలా? సైక్లింగ్ చేయాలా?

అధిక బరువు, ఊబకాయం ప్రస్తుతం యువత ముందు ఉన్న అతిపెద్ద సమస్యలు ఇవే అని చెప్పడంలో సందేహం అక్కర్లేదు. వారి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కొన్ని ఔషధాల సైడ్ ఎఫెక్ట్, వల్లకానీ, జీన్స్ లోపం ఇలా కారణం ఏదైనా యువతలో అధికబరువు, ఊబకాయస్తుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది. దానిని తగ్గించుకోవడానికి ఎన్నో మార్గాలు ప్రయత్నిస్తున్నా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. కొందరు జిమ్‌కు వెళ్తే మరికొందరు వ్యాయామం చేస్తున్నారు. మరికొందరు తమకు తెలిసిన ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లను చేస్తున్నారు. కాగా అధిక సంఖ్యలోని వారు ఆహారాన్ని నియంత్రించడం ద్వారా బరువు తగ్గొచ్చని, ఆ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కానీ నిపుణులు మాత్రం ఇంకోలా చెప్తున్నారు. బరువు తగ్గాలంటే నోటిని కట్టేయాలి కానీ.. నోటికి తాళం వేయడం సరికాదని చెప్తున్నారు. డైట్ చేయాలని కానీ పూర్తి ఉపవాసాలు చేస్తున్నట్లు ఆహారాన్ని బాయ్‌కాట్ చేయడం మంచిది కాదని, ఇలా చేయడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్తున్నారు. అదే విధంగా బరువు తగ్గాలంటే జాగింగ్, వాకింగ్ చేయాలా? లేకుంటే సైక్లింగ్ చేయాలా? అనేది కూడా చాలా మందిని పీడిస్తున్న ప్రశ్న అని తాము గుర్తించినట్లు నిపుణులు చెప్తున్నారు. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనుకుంటే ప్రారంభదశలో వ్యాయామాలు చేయడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి రోజూ నడవడం ద్వారా మన ఆరోగ్యం పెంపొందుతుంది. క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరం దృఢంగా తయారవుతుంది. ఎముకలు, వెన్నునొప్పితగ్గుతాయి. మన శరీర భంగిమ మెరుగవుతుంది. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. నడకతో పోలిస్తే సైక్లింగ్ ప్రభావం ఎక్కువగా ఉండదు. అలాగని సైక్లింగ్ వల్ల లాభాలేమ లేవని కాదు. సైక్లింగ్ చేయడం ద్వారా కూడా అనేక లాభాలు ఉన్నాయి. కానీ వాకింగ్ చేయడం వల్ల శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి. వాకింగ్ చేసే సమయంలో మన శరీర బరువు మొత్తాన్ని పాదాలు మోస్తాయి. సైక్లింగ్ సమయంలో అదేమీ ఉండదు. వేగంగా పెడ్లింగ్ చేయడం ద్వారా వ్యాయామ తీవ్రత పెరుగుతుంది. దీని ద్వారా రోగనిరోధక శక్తి అధికమవుతుంది. బరువు తగ్గడానికి కూడా సైక్లింగ్ అద్భుతంగా పనిచేస్తుంది.

కానీ వాకింగ్ ద్వారా కూడా బరువు తగ్గొచ్చు. వాకింగ్ శరీరాన్ని బలంగా మార్చడానికి దోహదపడుతుంది. ప్రతి రోజూ ఎక్కువ దూరం నడవం వల్ల శరీరం బలంగా మారుతుంది. సైక్లింగ్ చేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ రెండూ కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. కానీ సైక్లింగ్ చేయడం వల్ల ఎక్కువ కేలరీలు కరుగుతాయి. డైట్ చేస్తూ సైక్లింగ్ చేయడం ద్వారా బరువు వేగంగా తగ్గొచ్చు. అదే వాకింగ్ చూసుకుంటే.. దీని ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. మనల్ని ఫిట్‌గా ఉంచుతుంది. త్వరగా బరువు తగ్గాలనుకుంటే సైక్లింగ్ చేయడం మంచిది. అంత తొందరేమీ లేదు.. ఫిట్‌నెస్‌తో పాటు బరువు తగ్గాలి అనుకుంటే వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అని నిపుణులు సూచిస్తున్నారు.





# వయాగ్రా టాబ్లెట్స్ ఎలా పుట్టాయో తెలుసా..?

అనుకున్నది అనుకున్నట్లు జరగకపోవడమే జీవితం. కఈ రూల్ జీవితానికే కాదు సైన్స్‌కు కూడా వర్తిస్తుంది. సైన్స్‌లో కూడా చాలా అంశాలు అనుకున్నదానికి విభిన్నంగా జరిగి.. వేరే ఫలితాలు వచ్చే అవే అతిపెద్ద ఆవిష్కరణలుగా మారాయి. ఏంటి నమ్మకం కలగట్లేదా.. దీనికి అతిపెద్ద ఉదాహరణే వయాగ్రా. అవును మీరు విన్నది కరెక్టే.. వయాగ్రా ట్యాబ్లెట్ తయారీని స్టార్ట్ చేసింది అసలు శృంగార శక్తిని పెంచాలన్న ఉద్దేశంతో కాదు. వేరే ఏదో వ్యాధికి మందుకోసం ప్రయత్నిస్తూ ఈ ట్యాబ్లెట్‌ను కనుగొంటే.. దీని రియాక్షన్ ఇంకెక్కడో వచ్చింది. దీంతో నాడు పరిశోధకులు ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఫలితంగా అంగస్తంభన సమస్యకు ఆమోదం పొందిన మొట్టమొదటి నోటి మాత్ర అంటూ 1998లో అమెరికా, బ్రిటన్ లో వయాగ్రా మార్కెట్లలోకి వచ్చింది. అమ్మకాల్లో చరిత్ర సృష్టించింది! బ్రిటన్ లోని సౌత్ వేల్స్ లో మెర్తిల్ ట్విడ్ ఫిల్ అనే చిన్న పారిశ్రామిక పట్టణం ఉంది. అక్కడున్న ఒక ఉక్కు పరిశ్రమ మూతపడడంతో స్థానికంగా ఉండే కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి రోజువారీ ఆహారం దొరకడం కూడా కష్టమైపోయింది. ఈ సమయంలో వారి ఆర్థిక ఇబ్బందులే వారిని క్లినికల్ గినీ పిగ్స్ గా మార్చేసింది. నాడు వీరు అంగీకరించకపోతే వయాగ్రా పుట్టేదేకాదు అని అన్నా అతిశయోక్తి కాదు! 1990ల ప్రారంభంలో అధిక రక్తపోటు సమస్యకు చెక్ పెట్టేందుకు ఔషధాలు తయారు చేసే ఫైజర్ సంస్థ సిల్డెనాఫిల్ యుకె92,480 అనే ఒక కాంపౌండ్ ను పరీక్షిస్తోంది. ఈ సమయంలో ఔషధాన్ని పరీక్షించడానికి స్థానిక యువకులను రిక్రూట్ చేసుకున్నారు. ఇందులో భాగంగా 1992లో ఆ కొత్త ఔషధాన్ని పరీక్షించే ప్రక్రియలో పాల్గొనడానికి ఆ పట్టణంలోని కార్మికులు అంగీకరించారు.

ఇలా క్లీనికల్ ట్రయల్స్ లో భాగంగా ఆ డ్రగ్ వల్ల యువకుల్లో ఒక అనూహ్యమైన సైడ్ ఎఫెక్ట్ కనిపించింది. అవును... ఈ డ్రగ్ తీసుకోవడం వల్ల అంగస్తంభన మామూలు కంటే కాస్త ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తోందని వాళ్లు వైద్యులకు తెలిపారు. ఇదే సమయంలో ఇంతకు ముందుకంటే ఎక్కువగా అంగం గట్టిపడినట్లు అనిపించిందని వెల్లడించారు. ఈ సైడ్ ఎఫెక్ట్స్ ను గమనించిన ఫైజర్ సంస్థ.. అప్పటికే జరుగుతున్న అధిక రక్తపోటు సంబంధ అధ్యయనంతోపాటూ నపుంసకత్వంపై కూడా రీసెర్చ్ చేయడానికి నిధులు సమకూర్చింది. ఈ క్రమంలో 1994 ప్రాంతంలో స్వాంజీలో తమ తదుపరి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే ముందు అంగస్తంభన సమస్యలు ఉన్న రోగులకు ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించింది. ఇలా స్వాంజీలో జరిగిన అధ్యయనంలో ఫైజర్ సంస్థకు పాజిటివ్ ఫలితాలు కనిపించాయి. దీంతో తమ చేతిలో ఉన్న ఔషధం చరిత్ర సృష్టించబోతోందని వారికి త్వరగానే అర్థమైంది. ఈ సమయంలో ఈ పరీక్షల ఫలితాలు ఎంత పాజిటివ్ గా ఉన్నాయంటే... ట్రయల్స్ లో పాల్గొన్న మగవాళ్లు కొందరు వారికి ఇచ్చిన టాబ్లెట్లను కంపెనీకి తిరిగి ఇవ్వడానికి నిరాకరించారు.

ఈ సమయంలో అంగస్తంభన సమస్యకు ఆమోదం పొందిన మొట్టమొదటి టాబ్లెట్ అంటూ 1998 మార్చి 27న ఎఫ్.డీ.ఏ. అప్రూవల్ పొందింది. అనంతరం అమెరికా, బ్రిటన్ లో వయాగ్రా మార్కెట్లలోకి వచ్చింది. అలా వచ్చీ రాగానే సంచలనాలు సృష్టించిన ఈ డ్రగ్... 2008 కల్లా దాదాపు 200 కోట్ల డాలర్ల వార్షిక విక్రయాలతో ఫార్మా చరిత్రలోనే అత్యంత వేగంగా అమ్ముడవుతున్న డ్రగ్ గా రికార్డులకెక్కింది. ఇదే సమయంలో... మారుతున్న కాలానికి, జీవిన శైలికి అనుగుణంగా పెరుగుతున్న అంగస్తంభన సమస్య వల్ల ఈ వయాగ్రా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా... 1995 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 15 కోట్ల మంది ఈ అంగస్తంభన సమస్యలు ఎదుర్కొన్నారని... అయితే 2025 నాటికి వీరి సంఖ్య 32 కోట్ల మందికి చేరుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.